తెలుగు సాహితీ సాంస్కృతిక కళాజాతరకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 19,20 తేదీల్లో తాడేపల్లిలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సాంస్కృతిక కళా జాతరకు కవులు దేవానంద్, నిర్మల్ కుమార్, ఉమాకవిని ఆహ్వానించారు. శ్రీశ్రీ కళావేది వేదిక అంతర్ జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రామావతి, జాతీయ అధ్యక్షులు ఈశ్వరిభూషణం, కార్యదర్శి పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అనేక మంది కవులు, కళాకారులు పాల్గొననున్నారు. నాన్ స్టాప్‌గా 24 గంటల పాటు జరగనున్న ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డు బద్దలు కొడుతుందని మేధావు అంటున్నారు. ప్రపంచ ఐఎస్ఒగుర్తింపు పొందిన అంతర్జాతీయ సంస్థ ఇప్పటికే అనేక ప్రపంచ రికార్డులు సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమంలో పాల్గొని కవితా గానం వినిపించే అవకాశం రావడం చాలా గొప్పవిషయమని దేవానంద్, నిర్మల్ అన్నారు.

చరిత్రలో విజయనగరానికి సమున్నత స్థానం

- శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు
- ఘనంగా ప్రారంభమైన విజయనగరం ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

విద్యలనగరంగా పేరొందిన విజయనగరానికి చరిత్రలో సమున్నత స్థానం ఉందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విజయనగరం ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అయోధ్యా మైదానంలో జరిగిన ఉత్సవ ప్రారంభ కార్యక్రమానికి సభాపతి అయ్యన్నపాత్రుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఈ నేలలో నడయాడిన మహానుభావులు చేసిన సేవలను స్మరించుకుని నివాళులర్పించారు. మన ప్రాంత వైభవాన్న, ఘన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విజయనగరం గౌరవాన్ని, కీర్తిని నిలబెట్టడానికి ఈ ఉత్సవాలు దోహదం చేస్తాయన్నారు. ఊరంతా పండగ వాతావరణం నెలకొందని తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ 24వ సారి నిర్వహిస్తున్న ఈ విజయనగరం ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశామన్నారు. సభకు అధ్యక్షత వహించిన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు మాట్లాడుతూ ఉత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, జిల్లా అధికారులు, ఆయా వేదికల ఇన్‌ఛార్జులు, వివిధ పార్టీల ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ సైకత శిల్పాన్ని సందర్శిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సంధ్యారాణి, కలెక్టర్

నగరానికి పండగ శోభ

విజయనగరం ఉత్సవాల ప్రారంభ ర్యాలీ నగరానికి పండగ శోభను తెచ్చింది. పైడితల్లమ్మ ఆలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ అయోధ్యా మైదానం వరకు సాగింది. కోలాటాలు, తప్పెటగుళ్ళు, బిందెల నృత్యం, కర్రసాము, కత్తి సాము, విచిత్ర వేషాలు, వివిధ జానపద కళారూపాలు, ఒంటెలు, గుర్రాలు, దేశ నాయకులు, కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు, విద్యార్థులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో సుమారు 55 బృందాలు ర్యాలీలో పాల్గొన్నాయి. ఈ ర్యాలీని అతిథులంతా కోట వద్ద నుంచి తిలకించారు. ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి ఈ ర్యాలీకి ఇన్‌ఛార్జిగా వ్యహరించారు.

పులివేషధారులతో మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి, కలెక్టర్ అంబేద్కర్, జెసి

పుష్ప ప్రదర్శన ప్రారంభం

విజయనగరంకోట : స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లోని అఖిలభారత డ్వాక్రా బజార్ వద్ద ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శనను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం ప్రారంభించారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో పుష్పాలతో వివిధ థీమ్స్‌ను ఏర్పాటు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను స్పీకర్‌తోపాటు మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తిలకించారు. జిల్లా ఉద్యానశాఖ డిడి జమదగ్ని, ఎడి శైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చరిత్రను చాటిచెప్పిన లేజర్‌షో

విజయనగరంకోట : విజయనగరం కీర్తిని, చరిత్రను నేటితరానికి తెలిసేలా లేజర్ షోను ఏర్పాటు చేసినట్లు కేంద్ర మాజీమంత్రి గజపతిరాజు అన్నారు. స్థానిక కోట వద్ద ఏర్పాటుచేసిన లేజర్‌షోను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరం గత వైభవం నేటి తరానికి, భావితరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్‌పి, ఎమ్మెల్యే

పైడిమాంబను దర్శించుకున్న ప్రముఖులు

విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ వారిని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పూజారులు, అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని స్పీకర్‌కు అందజేశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పైడితల్లమ్మను చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, పూజారులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని బహుకరించారు.

అలరించిన శతాధిక కవి సమ్మేళనం

విజయనగరంకోట : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎంఆర్ రిక్రియేషన్ క్లబ్‌లోని సాహిత్య వేదికపై ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలు సాహితీ ప్రియులను అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం, భువన విజయం ఆకట్టుకున్నాయి. మహారాజా సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ గంటా జనార్ధన్ నాయుడు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కవులు సాహితీవేత్తలు పాల్గొని తమ సాహితీ ప్రతిభను ప్రదర్శించారు. శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమాన్ని రత్నాల బాలకృష్ణ, చీకటి దివాకర్, సూర్యలక్ష్మి, మానాప్రగడ సాహితీ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించగా, కవులు తమ కవితలను చదివి వినిపించారు. వారందరినీ జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. భువన విజయం కార్యక్రమానికి జక్కు రామకృష్ణ, కట్టమూరి చంద్రశేఖర రావు అనుసంధాన కర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.తిరుపతి నాయుడు, నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్, జిల్లా సహకార అధికారి రమేష్ తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కవితలు చదువుతున్న కవులు



విద్యార్థి ఏర్పాటుచేసిన ప్రదర్శనను సందర్శిస్తున్న కేంద్రమాజీ మంత్రి అశోక్

విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

విజయనగరం టౌన్ : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఎంఆర్ హైస్కూల్లో విద్యా శాఖ ఏర్పాటు చేసిన ఎపిజె అబ్దుల్ కలామ్ సైన్స్ ఫెయిర్‌ను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదివారం ప్రారంభించారు. ఇందులో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు 210 వరకు ఏర్పాటుచేశారు. సైన్స్ ప్రదర్శనతోపాటు క్రాఫ్ట్, స్టాంపులు, నాణేల ఎగ్జిబిషన్, చిత్రలేఖ ప్రదర్శన, వీరసైనికులు చిత్రాలు, విజయనగరం విశిష్ట వ్యక్తులు చిత్రప్రదర్శన, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనలు తయారు చేసిన విధానం, వాటి వల్ల ఉపయోగాలు ఏమిటి? అనేది జెసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, విద్యాశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనోహరం.. నృత్యరూపకం

కళాకారిణుల నృత్యప్రదర్శన

విజయనగరం కోట : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. నర్తనశాల విద్యార్థుల కూచిపూడి డ్యాన్స్ ఆహూతులకు కనువిందు చేసింది. పలు నృత్య కళాశాలల విద్యార్థుల శాస్త్రీయ సంగీతం.. క్లాసికల్ డ్యాన్స్.. భరత నాట్యం, భక్తి సంగీతం.. ఇలా ఒకటేమిటి అన్నీ కార్యక్రమాలు ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నాయి. చిన్నారుల అభినయాలు ఆకట్టుకున్నాయి. నాదస్వరం, వీణ, వయోలిన్, మృదంగం, తబల తదితర వాయిద్యాలు వినసొంపుగా సాగాయి. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. వేదిక ఇన్‌ఛార్జులు బి.ఉమాశంకర్, జానకమ్మ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు జరిగాయి.

అలరించిన జానపద కళ రూపాల ప్రదర్శన

లయన్స్ కమ్యూనిటీ హాలులోని ఆదిభట్ల నారాయణదాసు కళావేదికపై ఆదివారం ప్రదర్శించిన జానపద కళారూపాలు, యుద్ధ క్రీడలు ఆహూతులను కట్టిపడేశాయి. తప్పెటగుళ్ళు, హరికథ, పులివేషాలు, జముకుల కథ, కోలాటం, బుర్రకథ వంటి జానపద కళారూపాలు ప్రేక్షకులను అలరించాయి. పద్మనాభం తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

కళాకారిణుల నృత్యప్రదర్శన

సంపాదనే ధ్యేయంగా సిండికేట్లు

- మద్యం వ్యాపారంలోకి కొత్త కొత్త వ్యక్తులు
- ఇబ్బడిముబ్బడిగా పెరిగిన దరఖాస్తులు
- నేడు మద్యం దుకాణాలకు లాటరీ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఒకప్పుడు మద్యం వ్యాపారమంటే నియోజకవర్గ స్థాయిలో లేదా మండల స్థాయిలో ఒకరో ఇద్దరో ఆసక్తి చూపించేవారు. ఆ రంగంలో అనుభవం ఉన్న వారే మద్యం షాపుల నిర్వహణకు ముందుకొచ్చే పరిస్థితి ఉండేది. గత ప్రభుత్వం మద్యం అమ్మకాన్ని ఉపాధి అవకాశంగా మార్చే ప్రయత్నం చేసింది. ప్రభుత్వం ఆధ్వర్యాన మద్యం షాపులు నిర్వహించి ఒక్కో షాపులో రెండు ఉద్యోగాలు ఉండేలా పథకాన్ని రూపొందించింది. గతంలో తెలుగు రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వమే మద్యం షాపులను ఏర్పాటు చేసింది. ఈ షాపులో ఒక సూపర్ వైజర్, ఒక సేల్స్ మాన్ ఉద్యోగాలను సష్టించింది. డిగ్రీలు, పిజి చదివినా ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం అతికష్టంగా ఉన్న ఈ రోజుల్లో మద్యం షాపు ఉద్యోగాల కోసం చాలామంది నిరుద్యోగ యువత పోటీపడ్డారు. అప్పటి అధికారపార్టీ నాయకుల ఆశీస్సులతో ఉద్యోగాలు సంపాదించుకుని ఐదేళ్లలో నాలుగు రాళ్ళు వెనకేసుకు న్నారు. అయితే టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వానికి పూర్తి భిన్నంగా ప్రయివేటు మద్యం షాపులను తెరమీదకు తీసుకొచ్చింది. దీంతో గతంలో ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసిన వారంతా నిరుద్యోగులయ్యారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ప్రయివేటు పాపులకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈనెల 9 సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని మొదట ప్రకటించింది. అనూహ్యరీతిలో ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు వచ్చిపడ్డాయి. దరఖాస్తు రుసుం కింద ప్రభుత్వం రూ.రెండు లక్షలు నిర్ణయించింది. దరఖాస్తు రుసుం భారీగా పెరిగినా తగ్గేదెలా అన్నట్లు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు.దీంతో మరో రెండు రోజులు గడువు పెంచింది. ఈనెల 11 సాయంత్రం 7లోగా దరఖాస్తు కి అవకాశం కల్పించింది. మండలాల్లో, పట్టణాల్లో కొంతమంది వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి తలా కొంత సొమ్ము ఎత్తుకుని అధికంగా దరఖాస్తులు చేశారు. మద్యం అమ్మకాన్ని లాభసాటి వ్యాపారంగా భావించిన రాజకీయ నిరుద్యోగులు ఎక్కువగా దరఖాస్తు చేసుకున్నారు. వారి నమ్మకాన్ని సొమ్ము చేసుకునే యత్నంలో ప్రభుత్వం కూడా దరఖాస్తు గడువును రెండు రోజులు పెంచింది. గడువు పెంపు ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడంలో ప్రభుత్వం విజయవంతమైంది. ఈసారి మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసిన వారిలో ఎక్కువ మంది కొత్త వ్యక్తులు కూడా ఉన్నారు. గతంలో ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసిన వారు కూడా ఉన్నారు. మద్యం షాపులకు దరఖాస్తులను కోరడం ద్వారా తగినంత ఆదాయం సమకూర్చుకోవాలని భావించింది. అనుకున్నట్లుగానే దరఖాస్తు రుసుం రూపంలో ఆశించిన స్థాయిలో డబ్బులు సమకూరాయి. వెనుకబడిన మన్యం జిల్లాలో కూడా మద్యం షాపుల నిర్వహణకు అధికసంఖ్యలో దరఖాస్తులు చేరాయి. ఒక్కో సిండికేట్ గ్రూపు కనీసం ఐదు నుంచి పది షాపులకు దరఖాస్తు చేయాలనే లక్ష్యంతో దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. వీటిలో సగం లాటరీ ద్వారా తగిలినా తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమనే ఉద్దేశంతో ఉన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులంతా కూడబలుక్కుని సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో విభేదాలున్నా ధనార్జన ధ్యేయంగా ఒక్కటవ్వాలని భావించారు.

దరఖాస్తుల రూపంలో ఖజానాకు కిక్

మన్యం జిల్లాలో 52 మద్యం షాపులకు 1376 దరఖాస్తులు చేరాయి. వీటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.27.50 కోట్ల మేరకు ఆదాయం లభిస్తోంది. జిల్లాలో ఒక్కో షాపు కోసం సగటున 26 మంది రేసులో వున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సమక్షంలో మద్యం షాపుల కు లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నారు. 16నుంచి ప్రయివేటు వ్యాపారుల చేతుల్లోకి మద్యం షాపులు వెళ్లనున్నాయి.

అభివృద్ధికి ఆమడ దూరాన గిరిజన తండాలు

- ఎక్కడి సమస్యలు అక్కడే
- అధ్వాన రోడ్లతో అవస్థలు

బట్టిగూడ గిరిజన తండాలో వృథాగా పడి ఉన్న జలజీవన్ మిషన్ కుళాయి పాయింట్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు పైబడినప్పటికీ నేటికీ గిరిజన తండాలు అభివృద్ధికి నోచుకోలేదంటే పాలకుల పనితీరు ఏవిధంగా ఉందో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమివ్వడంతో గిరిజన తండాలు సమస్యలతో స్వాగతమిస్తున్నాయి.

మండలంలోని గదబవలస, ఎలిసిపురం, నీలంపేట, రాయిమానుగూడ, పాలగూడ, సందిమానుగూడ, బల్లగుడ్డి, కాగితాడ, బట్టిగూడ, జరడ, రామాపురం, కె.ఇచ్ఛాపురం తదితర గిరిజన తండాల్లో సరైన మౌలిక సదుపాయాల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చినగోర, బట్టిగూడ, గోరకాలనీ, కొత్తబట్టిగూడ తదితర గిరిజన తండాల్లో గిరిజనులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా గిరిజన తండాల్లో కుళాయి పాయింట్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా చుక్క నీరు రాకపోవడంతో గిరిజన తండాల్లో ఇవి ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్నాయి. అలాగే కె.ఇచ్ఛాపురం, కాగితాడ, బల్లగుడ్డి, రామాపురం, గదబవలస, నీలంపేట, బట్టిగూడ, రాయిమానుగూడ, సంధిమానుగూడ, ఎలిసిపురం, తదితర గిరిజన తండాలకు రహదారి సౌకర్యాలు లేకపోవడంతో గిరి పుత్రులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి చినుకులుపడ్డా తండాలకు వెళ్లే రహదారులు బురదమయం కావడంతో రాకపోకలకు మరిన్ని అవస్థలకు గురికావాల్సి వస్తుంది. తండాల్లో ఎవరికైనా అనారోగ్యమైతే కనీసం 108, 104 వచ్చే దాఖలాల్లేవు. ముఖ్యంగా విద్యార్థులు, గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన రోడ్డు పనులతో అవస్థలు

మండలంలోని హుస్సేన్‌పురం, తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ సెవెంత్ బ్రాంచి పరిధి నుంచి హుస్సేన్ పురం గ్రామం మీదుగా నీలంపేట, ఎలిసిపురం, సంధిమానుగూడ, మీదుగా జరడ, గిరిజన తండా వరకు లింకు రోడ్డు వేసేందుకు 2019 గత టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.4.67 కోట్లతో బిటి రహదారి నిర్మించేందుకు అప్పట్లో పనులు చేపట్టారు. నేటి వరకు పనులు చేపట్టకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయిందని, రహదారిపై రాళ్లు తేలిపోవడం వల్ల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయా తండాల చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జన్‌మన్ గిరిజన తండాలు అభివృద్ధి జరిగేనా

మండలంలోని శృంగరాయపురం, పెద్దూరు, సింధునగర్, ఎస్ గోపాలపురం, అచ్చిపవలస, బల్లగుడ్డి, గంగంపేట, వంకాయలగెడ్డ, బట్టిగూడ, కొండవారిగోర, సవరగదబవలస, సంధిమానుగూడ, కొత్తగూడ, శాంతి గూడ, గాదిలంక, మూలలంక, మామిడి మానుగోరా తదితర గిరిజన తండాలను ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన ద్వారా తొమ్మిది మంత్రత్వ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధిపరిచేందుకు గిరిజన తండాల్లో సమావేశాలు, సభలు నిర్వహించారు. అందరికీ పక్కా గృహాలు, ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి, ప్రతి గ్రామానికి రహదారులు, ప్రతి ఇంటికి విద్యుత్తు, అందరికీ విద్య, న్యాయమైన విద్య నైపుణ్య వికాసం, అందరికీ ఆరోగ్యం, జీవనోపాదులు మెరుగుపరుచుట, ప్రచార సాధనాల సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించారని, అయితే ఇప్పటి వరకు ఎటువంటి కార్యరూపం దాల్చలేదని స్థానికులు చెబుతున్నారు. ఎక్కువ జనాభా కలిగిన దళిత గ్రామాలైన చిట్టిపూడివలస, పనస నందివాడ గ్రామాలను ఎంపిక చేసి మానవునికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే ఇక్కడ ఏ విధమైన పనులు జరగకపోవడంతో గ్రామ స్వరాజ్యం ప్రచారానికే పరిమితమైందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు, స్పందించి గిరిజన తండాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

నీలం పేట గిరిజన తండా కి వెళ్లే రాళ్లు తేలిన రహదారి

క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న కడప డిఎఫ్ఓ రాజశేఖర్

ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదం

ప్రజాశక్తి - పాలకొండ

యువతకు క్రీడలు ఎంతో అవసరమని కడప జిల్లా అటవీ శాఖ అధికారి టి.రాజశేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో దసరా చాలెంజ్ క్రికెట్ కప్ టోర్నమెంటు ఫైనల్ పోటీలో భాగంగా పాలకొండ, వీరఘట్టం టీం సభ్యులకు ఆదివారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ యువతలో స్నేహ సంబంధాలు పెరిగి, పోటీతత్వం ఎదుర్కోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ క్రీడలు వల్ల చెడు వ్యసనాలకు కూడా దూరమవుతారని అన్నారు. కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఎన్.భరత్ భూషణ్, యోగా గురువు కె.జనార్ధన్ ఉన్నారు.

వీరేష్‌కు పూల బొకేను అందజేస్తున్న అందజేస్తున్న ట్రైకార్ బోర్డు సభ్యులు లావణ్య

వీరేష్ చంద్రదేవ్‌ను కలిసిన ట్రైకార్ సభ్యులు లావణ్య

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌ను ఆదివారం ఆయన కోట వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ బోర్డు సభ్యులు పువ్వల లావణ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని, తనపై నమ్మకం ఉంచి అధిష్టానం ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని అన్నారు. అలాగే వీరేష్‌చంద్రదేవ్ సూచనలు, సలహాలు తీసుకొని గిరిజనుల అభివృద్ధికి ట్రైకార్ రుణాలు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, నేరేడుబిల్లి వంశీ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపాటి బుచ్చప్పారావుకు నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

గొర్రెపాటికి నివాళి

ప్రజాశక్తి - సాలూరు

స్వాతంత్ర్య సమర యోధుడు గొర్రెపాటి బుచ్చప్పారావు 111వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కొప్పల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెలంపేట శ్రీ సీతారామ కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు ఆయన సేవలను కొనియాడారు. బుచ్చప్పారావు స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాటాలు చేశారని చెప్పారు. జైలు జీవితం కూడా అనుభవించారన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. తాటిపూడి రిజర్వాయర్‌కు గతంలో ఉన్న ఆయన పేరును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

అడలి వ్యూ పాయింట్‌ను తిలకిస్తున్న సందర్శకులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్‌టియార్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. దసరా పండుగ అందులో ఆదివారం రావడంతో స్కూల్ పిల్లలకు సెలవులు. దీంతో పర్యాటకులు బంధువులతో పార్క్‌కు పర్యాటకులు పోటెత్తారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నీటిపై నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు కమాండోనేట్ ఎక్కి ఆడుకున్నారు మరికొనంతమంది ఆనంద విహార వద్ద ఉల్లాసంగా ఉత్సాహంగా డాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు. అనంతరం ఆడలి యు పాయింట్ సందర్శించి అక్కడ ఉన్న ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

చెరువుల్లో కబ్జాలు తొలగించాల్సిందే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని చెరువుల్లో కబ్జాలను తొలగించాల్సిందేనని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు అన్నారు. పట్టణంలో కబ్జాకు గురైన దేవుడి బందలో సమితి అధికార ప్రతినిధి సిగడాం భాస్కరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేజేటి దయామణి, జిల్లా ఉపాధ్యక్షులు వండాన నేతాజీ, రాష్ట్ర కార్యదర్శి మండల పకీరు నాయుడు తదితరులతో కలిసి ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పాలకొండ, సాలూరు, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లో కబ్జాకు గురైన చెరువులను ఎమ్మెల్యేలు, మంత్రులు రక్షించాలన్నారు. కబ్జాలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే తాము కబ్జాకు గురైన చెరువుల డాక్యుమెంట్లను సిద్ధం చేశామన్నారు. భావితరాలకు తాగు, సాగునీరందివ్వడంతో పాటు పర్యావరణాన్ని కాపాడడం, భూగర్భ జలాలను రక్షించడం, జంతు జలజీవరాసులు, పశుపక్ష్యాదులు ఉనికికి నిలయమైన జలవనరులను రక్షించేందుకు న్యాయస్థానానికి వెళ్తామన్నారు. పార్వతీపురంలో బిల్లబంద, దేవుడిబంద, కోదువానిబంద, నెల్లిచెరువు, గోపసాగరం, లక్ష్మనాయుడు చెరువు, కొత్తవలసలోని పలు చెరువులు కబ్జాకు గురయ్యాయన్నారు. రక్షించేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టాలన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. కబ్జా సమయంలో పనిచేసిన అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో యాత్ర నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. మేధావులు, సామాజిక స్పృహ కలిగిన వారు, ప్రకృతి ప్రేమికులు, సంఘసంస్కర్తలు ముందుకొచ్చి ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి చేపడుతున్న జల వనరుల పరిక్షణయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజనులు సాగు చేసుకుంటున్న కొండ, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఈతమానవలసలో శాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జెండాను సీనియర్‌నాయకులు మంచాల ఎరకయ్య ఆవిష్కరణ చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి హామీ, అటవీ, గిరిజన చట్టాలను తీసుకురావడంలోనూ, వాటిని పరిరక్షణ కోసం సిపిఎం కీలకపాత్ర వహిస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర పాలకులు తుంగలో తొక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పద్మాపురం వద్ద గల మాసాలగెడ్డ వద్ద వంతెన నిర్మించాలని సిపిఎం అనేక పోరాటాల ఫలితంగా నేడు పనులు ప్రారంభిస్తున్నారన్నారు. అలాగే పద్మాపురం ఇనాం భూముల పేరుతో నేటికీ గిరిజన, మైదాన ప్రాంత రైతులకు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. పోరాటం చేస్తే కచ్చితంగా సాధించుకుంటామని, సిపిఎం ఆధ్వర్యంలో భవిష్యత్ పోరాటాలకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు అన్ని గౌరమ్మ, ఎం.లక్ష్మి, సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : గిరిజన హక్కులు, చట్టాలను కాపాడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. మండలంలోని దేవకోన పంచాయతీ అంటివలసలో చిన్నారావు

సిపిఎం జెండాను ఎగురవేస్తున్న నాయకులు

అధ్యక్షతన సిపిఎం శాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించిన సీనియర్ నాయకులు గంగరాజు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇందిర మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో జిఒ3ని పునరుద్ధరించాలని, రెవెన్యూ పరంగా ఉన్న లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. అంటివలసలో రేషన్ కార్డు పేరున పూర్ణపాడు గ్రామం రాసి ఉన్నందున వెంటనే మార్పు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. అలాగే ఈ గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని, పారిశుధ్య సమస్యలపై దృష్టి పెట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, చిన్నారావు, రామస్వామి, రామారావు, బోడియ్య, తులసమ్మ పాల్గొన్నారు.

సుమిత్రాపురంలో నేడు పల్లె పండుగ

ప్రజాశక్తి - సీతానగరం

పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం సుమిత్రాపురంలో పల్లి పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యం నాయుడు, కె.వేణుగోపాలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్వతీపురం ఎమ్మెల్యే బోనులు విజయ్ చంద్ర హాజరవుతారన్నారు.

గుమ్మలక్ష్మీపురం :పల్లె పండుగ పంచాయితీ వారోత్సవంలో భాగంగా మండలంలోని ఎల్విన్ పేట పంచాయితీ సవర కోటపాడు పార్కులో ఎంజిఎన్‌ఆర్జిఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును కురుపాం ఎమ్మెల్యే టి.జగదీశ్వరి ప్రారంభిస్తున్నట్లు పిఆర్ ఎఇ మురళీధర్ తెలిపారు.

మక్కువ: ఈనెల 14 నుండి 20 వరకు జరుగునున్న పల్లె పండుగ కార్యక్రమానికి అంత హాజరు కావాలని ఎంపిడిఓ డిడి స్వరూపరాణి తెలిపారు. ఒకరోజు మూడు పంచాయతీలు కార్యక్రమం జరిగేలా టైం టేబుల్ నిర్ణయించారు. శంబర పంచాయతీతో మొదలై కన్నంపేట పంచాయతీతో కార్యక్రమం ముగియనుందని ఎంపిడిఓ తెలిపారు.

లీటరుకు రూ.10 అదనంగా పెంచాలి

కొత్తవలస : రాష్ట్రంలో పాల సేకరణ కనీస ధర పైన లీటరకు పది రూపాయలు పెంచాలని పాల రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం నిమ్మలపాలెం గ్రామ పంచాయతీలో గల పాల ఉత్పత్తిదారుల భవనం వద్ద ఆందోళన చేపట్టారు. పాల రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ అక్టోబర్ 18వ తేదీన జామి మండలంలో సదస్సు ఏర్పాటు చేస్తున్నామని నాయకులు గాడి అప్పారావు తెలిపారు.

కుక్కల జోరు.. ప్రజలు బేజారు

వీధి కుక్కలను నిర్మూలించాలని
ప్రజల వేడుకోలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

వీధి కుక్కల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒంటిరిగా తిరగాలంటే భయపడేలా కుక్కలు వ్యవహరించడం విచారకరం. ముఖ్యంగా చిన్న పిల్లలు, ముసలి వాళ్ళు ఒంటిరిగా పోలాలకు వెళ్ళేవాళ్లపై కుక్కలు దాడులు చేసి గాయపరుస్తున్నాయి. పట్టణం, మండల పరిధిలో రాత్రి 7గంటలు దాటితే బయట తిరిగే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కుక్కలను పట్టుకొని నియంత్రించేవారని, గత ఐదేళ్ళ నుంచి అటువంటి కార్యక్రమాలు ఏమీ చేయడం లేదని వాపోతున్నారు. రహదారులపై, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నవారి వెంట వెంట బడుతున్నాయని చెబుతున్నారు. మండలంలో మామిడిపల్లి, బాగువలస, పెద బోర బండ, తోనాం, కూరుకుట్టి, కందుల పదం, అన్నమరాజువలస గ్రామాలలో ఇటీవల కుక్కలు కరవడంతో బాధితులందరు సాలూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లి రేబిస్ మాత్రలు వేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంత పిహెచ్‌సిలలో రెబిస్ టీకాలు తక్కువ ఉండటంతో కుక్కలు కరిచిన వారందరూ సాలూరు ఏరియా ఆసుపత్రి కి వెళ్ళవలసి వస్తుందని చెపుతున్నారు. పట్టణంలో 29 వార్డులలో, మండలంలో 29 పంచాయతీలలో కుక్కలు సుమారు 1500 నుండి 2000 వరకు వుంటాయని ఇవి 20

కుక్కలదాడిలో గాయపడిన చిన్నారికి చికిత్స చేస్తున్న సిబ్బంది

నుండి 30 గుంపు గుంపులుగా వీధులలో తిరుగుతుండటం భయంతో ఒక్కొక్కరు బయటకు రావడం మానేశారు.

కుక్కల దాడిలో రైతు మృతి

ఇటీవల కాలంలో మామిడిపల్లిలో పొలం పనులు చేసుకోవడానికి బుగత చిన్నయ్య ఒంటరిగా వెళుతుండగా ఐదు కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో ఆయన స్థానిక మామిడిపల్లి పిహెచ్‌సికి వెళ్లారు. అక్కడ మందులు లేక పోవడంతో సాలూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందించారు. కొద్ది రోజులు తరువాత మరలా అతనికి కుక్క కరిచిన ఆనవాళ్లతో ఒంట్లో నీ ం ు స ు ం ఉండటంతో విశాఖపట్నం కెజిహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ రెండు రోజులు వైద్యం చేసిన తరువాత మరణించాడు. ఇలా చాలా మంది కుక్కల దాడిలో గాయపడటంతో పాటు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ప్రజలను కుక్కల బారి నుంచి రక్షించాలని పలువురు కోరుతున్నారు.

పాచిపెంట : మండల కేంద్రమైన పాచిపెంటతో పాటు పలు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ కరుస్తాయని, వీటిని అదుపు చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య కోరారు. మండలంలోని నిర్వాసిత గ్రామమైన ఎర్రడ్లవలసకు చెందిన జన్ని లేఖన, హెచ్.అఖిల్ చిన్నారులతోపాటు మరో వ్యక్తి చింత ప్రసాద్‌ను శనివారం కుక్కలు కరచి తీవ్రంగా గాయపర్చాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారులను ప్రాథమిక వైద్యం అనంతరం 108 వాహనం ద్వారా సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు బాధితులను పరామర్శించారు. కుక్కల బారి నుంచి ప్రజలకు, చిన్నారులకు రక్షణ కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు వందకు పైగా వీధి

కుక్కలు పాచిపెంట మండల కేంద్రం నుంచి చుట్టుపక్క గ్రామాలు తిరుగుతూ పశువులను, మేకలను కరిచి తినడంతో పాటు నేడు మనుషుల్ని కరిచి గాయపరుస్తున్నాయని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి కుక్కలను నిర్మూలించి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు స్కూలుకు వెళ్లాలన్నా, మహిళలు, వృద్ధులు నిత్యవసర వస్తువులు కోసం బజారు వెళ్లాలన్నా భయపడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులంతా స్పందించి పంచాయతీలకు బాధ్యత అప్పజెప్పి కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

వీరఘట్టంలోనూ అదే పరిస్థితి..

వీరఘట్టం: మండల కేంద్రంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలో అధికశాతం మాంసం దుకాణాలు ఏర్పాటు కావడంతో మాంసం ముక్కలు తినటం అలవాటు పడడంతో ఇప్పుడు ప్రజల పైన దాడి చేస్తున్నాయి. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి స్వామి థియేటర్ వరకు సుమారుగా 30 కుక్కలు గుంపులు గుంపులుగా సంచరించి అటుగా వెళుతున్న కె.రమేష్, పెరుగు చంద్రమౌళిపై దాడి చేయడంతో గాయపడ్డారు. స్థానికులు స్పందించి కుక్కల గుంపును తరిమి గాయపడిన వ్యక్తులను వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మేజర్ పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల గుంపు నుంచి మరిన్ని ప్రమాదాలు జరగక ముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాలతమ్మ దర్శనానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపాన నేరేడువలసలో వెలిసిన మాలతమ్మ గుడికి దసరా పండగను పురస్కరించుకొని శనివారం భక్తులు పోటెత్తారు. మన్యం జిల్లాలో పలు మండలాలు, గ్రామాలు, ఒడిశా ప్రాంతం నుంచి కూడా భారీగా యాత్రికులు తరలివచ్చి పూజలు ఘనంగా నిర్వహించారు. గుడి నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో వాహనాలు ఆపి నడిచి వెళ్లారు. ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో గల ఎస్సైలు పి. నారాయణరావు, శివప్రసాద్, నీలకంఠరావు పర్యవేక్షించి బందోబస్తును ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూశారు.

పార్వతీపురం టౌన్ : దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం నాడు రాత్రి జిల్లా కేంద్రంలో నాలుగు

పార్వతీపురంలో దుర్గాదేవి అనుపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రోడ్ల కూడలి వద్ద ఉన్న భవాని ఆలయంలో ఘనంగా జరిగే ముగింపు ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఉత్సవ సభ్యుల ఆధ్వర్యంలో కాల్చిన బాణాసంచా స్థానిక ప్రజలను విశేషంగా ఆకర్షించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెడుపై మంచి గెలిచిన రోజు దసరా అని, అన్ని వర్గాల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకునే పండగని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవదుర్గ తరని మాత సంబరాల్లో ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని లుంబేసు పంచాయతీ గౌడుగూడలో వెలసిన నవదుర్గ తరని మాత మల్లికార్జునుడు దసరా ఉత్సవాల్లో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సంబరాలకు, ఘటాల ఊరేగింపునకు హాజరయ్యారు. ఎమ్మెల్యే ముందుగా పాలజంగడి తలపై పెట్టుకొని తిరువీధిలో ఊరేగింపుగా నవదుర్గ మాతను ఊరేగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి చెందాలని, పాడిపంటలు సుభిక్షంగా పండాలని, నియోజకవర్గ ప్రజలంతా ఆనందంగా ఉండాలని, యువతి యువకులకు మంచి జరిగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

పాలకొండ : కోటదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ఘటాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు పల్లా కొండలరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, ఆలయ కార్యనిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నిత్యం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. తిరువీధి ఉత్సవాలు కూడా ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు దారలపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తి విగ్రహానికి ముందుగా పూజలు జరిపి, కోలాహలం మధ్య తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. డిఎస్‌పి ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సిఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉత్సవాలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. డిఎస్‌పి, సిఐ ఇద్దరూ పాతవారే కావడం, ఈ ప్రాంతంలో పట్టుండడంతో సమర్ధవంతంగా ఉత్సవాలు జరిపించారని ప్రజలు చెప్పున్నారు

లెప్రసీ సాధారణ వ్యాధి

వీరఘట్టం : లెప్రసీ సాధారణమైన వ్యాధి అని, దీని గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని విజయనగరం జిల్లాలోని చెల్లూరులో గల లెపర్సీ మిషన్ ప్రిన్సిపల్ గాబ్రిల్ ఫన్నీ అన్నారు. ఆదివారం స్థానిక తెలుగు బాప్టిస్ట్ దేవాలయంలో సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధి వల్ల భయపడాల్సిన అవసరం లేదని, అధైర్యపడొద్దని, నిబ్బరం ఉండాలని సభ్యులకు సూచించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లి వైద్య తనిఖీలు చేసుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలున్న పిల్లలకు చెల్లూరు లెప్పర్సీ మిషన్లు ఐటిఐ, డీజిల్ మెకానిక్ తదితరమైన శిక్షణ ఇచ్చి వారికి ప్లేస్మెంట్ కూడా ఇస్తుందని స్పష్టం చేశారు. అటువంటి వారు ఉంటే గుర్తించి తమకు వివరాలు అందజేయాలని సూచించారు. అంతేకాకుండా మిషన్ అభివృద్ధికి తమ వంతు ఆర్థిక సహాయం కూడా అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కాపరి వి.శంకర్రావు, మిషన్ కోఆర్డినేటర్ రాజు, శాంతి ఫన్నీ, సంఘ అధ్యక్షులు కె.ప్రేమభూషణరావుతో పాటు కార్యవర్గ సభ్యులు సంఘస్తులు పాల్గొన్నారు.

కొండచీపుర్లకు ధర లేక విలవిల

లబోదిబో మంటున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెట్ ధర లేక గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గిరిజనులకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థికంగా చేయుతనిచ్చేది కొండచేపుర్లు ఒకటి అని చెప్పవచ్చు. ఏజెన్సీలో గిరిజనులు సేకరించిన కొండ చీపుర్లు ఏడాది పాటు మన్నిక వస్తుంది. దీంతో పాటు నాజుగ్గా, అందంగా గిరిజనులు కడతారు. ఈ చీపుర్లకు మైదాన ప్రాంతంలో మంచి డిమాండు ఉన్నప్పటికీ కొండచీపుర్లకు మార్కెట్ ధర లేకపోవడంతో గిరిజనులు లబోదిబోమంటున్నారు. సీతంపేట ఏజెన్సీలో సుమారు 10వేల ఎకరాల వరకు కొండచీపుర్లు పంట ఉంది. అయితే ఈ ఏడాది పంట దిగుబడి ఉన్నప్పటికీ మార్కెట్ ధర మాత్రం ఒక్కొక్క కొండ చీపురు రూ.40లోపుకే పడిపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీలోని మర్రిపాడు, పూతికవలస, దోనుబాయి, పొల్ల, కుసిమి, కడగండి పరిసర ప్రాంతాల్లో అధికంగా కొండచీపుర్లు సాగువుతుంది. గిరిజనులు సోమవారం సీతంఫేట సంత, శనివారం కుసిమి, బుధవారం మర్రిపాడు సంతలకు కొండసీపుర్లు తెచ్చి విక్రయిస్తున్నారు. దళారులు సిండికేట్‌గా మారి సరైన మార్కెట్ ధర

సంతలో విక్రయిస్తున్న చీపుర్లు

ఇవ్వకపోవడంతో గిరిజనులు నష్టాలు చవిచూస్తున్నారు. గత ఏడాది సంతల్లో రూ.60కు పైగానే పలికేది. ఇప్పుడు పంట దిగుబడి ఉన్నప్పటికీ ఒక్కసారిగా ధర పడిపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.. దీనిపై జిసిసి మేనేజర్ దాసరి కృష్ణ వద్ద ప్రస్తావించగా, ప్రస్తుతం వస్తున్నది పాత పంట అని, జనవరి నుంచి కొత్త పంట వస్తుందని తెలిపారు. జనవరి నుంచి కొనుగోలు చేస్తామని సమాధానం ఇచ్చారు.

పిఎంజె జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం

విజయనగరం : నగరంలో పిఎంజె జువెల్స్ షోరూమ్‌ను ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి దసరాను పురష్కరించుకుని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దక్షిణ భారతం, అమెరికాలో ఉన్న పిఎంజె 39 పైగా స్టోర్లలో ఇది కొత్తదన్నారు. ఇటువంటి షోరూమ్ విజయనగరంలో ప్రారంభిం చడం ఆనందంగా ఉందన్నారు. ఒక కస్టమర్‌గా విజయనగరం లోని ఆభరణాల ప్రియులందరినీ ఈ స్టోర్ ఆకర్షిస్తుందని తాను హామీ ఇస్తున్నానని చెప్పారు. పిఎంజె జ్యువెల్స్ తమ వినియోగదారులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించగలదని తాను నమ్ముతున్నానని అన్నారు. దీనికి ముందు పిఎంజె జ్యువెల్స్ ఆంధ్రప్రదేశ్ అధినేత హైదర్ అలీ, డైరెక్టర్ ఆనంద్ జిలగం, విజయనగరం స్టోర్ మేనేజర్ బి. అనంత్ కుమార్‌తో కలిసి ఆమె ఈ కొత్త స్టోర్‌ని ప్రారంభించారు. విజయనగరం, చుట్టు పక్కల ప్రాంతాలలోని వినియోగదారుల విభిన్న అభిరుచులను దృష్టిలో ఉంచుకుని ఈ షోరూమ్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. విజయనగరం స్టోర్ మేనేజర్ అనంత్ కుమార్ మాట్లాడుతూ తమ కొత్త స్టోర్‌లో మంత్ర ముగ్ధులను చేసే ఆభరణాల డిజైన్‌ల భారీ ప్రదర్శనను ఆస్వాదించడానికి ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నా మన్నారు. కార్యక్ర మంలో షోరూమ్ నిర్వాహుకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రాజేష్

వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఆదివారం వాహనదారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం.రాజేష్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. కొంతమంది వాహనదారులతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. లైసెన్సు ఇన్సూరెన్స్ హెల్మెట్ తప్పక ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతబొబ్బిలి గ్రామానికి చెందిన రౌతు వరలక్ష్మి(59) మృతి చెందారు. వరలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి భీమవరం కారులో వెళు _న్నారు. కాళ్ళ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ లైటింగ్ కళ్లకు తగలడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు కారు ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న కుమారుడు ఆర్.కె.నాయుడుతో పాటు మరొకరు స్వల్పంగా గాయపడ్డారు.

సముద్రంలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చింతపల్లి సముద్రంలో ఆదివారం గరివిడి మండలం దుమ్మెదకు చెందిన ఇజ్జపురపు అచ్యుతరావు (25) గల్లంతయ్యాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం దుమ్మెద నుంచి దేవి విగ్రహం నిమజ్జనం నిమిత్తం సముద్రంలో దిగారు. ఆ సమయంలో కొట్టుకుపోయినట్లు కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. సముద్రంలో పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు.